# కవితా కౌముది

శ్రీ విళంబి నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
23 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
కవిత విభాగంలో బహుమతి పొందిన కవితలు

## జీవనవాహిని

అంజలి

సాగరం ప్రేమలేఖలు వ్రాస్తూనే ఉంది
తీరం అన్నింటినీ తిరస్కరిస్తూనే ఉంది

తొలికిరణాల రథాన్నెక్కి వేకువ వచ్చేసింది
రాత్రి ఇంకా కలలకావ్యం రచిస్తునే ఉంది

ఒక కోకిల తొట్టతొలి వసంతాన్ని చూసింది
వసంతం వెళ్ళిపోయినా కమ్మగా కూస్తూనే ఉంది

వందలు వేలై, లక్షలై, కోటానుకోట్లయ్యాం మనం
పెద్దమనసు చేసుకుని వసుధ భారం వహిస్తూనే ఉంది

తెరపడ్డాక ఎవరిదారిన వాళ్ళు వెళ్తున్నారు
జగన్నాటకం మాత్రం ఇంకా నడుస్తూనే ఉంది

కటిక చీకటిగ మూఢత్వం అలుముకుని ఉంటే
జిజ్ఞాస ప్రశ్నల దివ్వెలు వెలిగిస్తూనే ఉంది

తుఫానులో ఒక జాలరిపడవ బోల్తా పడింది
పెనిమిటికోసం ఒక ప్రాణం ప్రార్థిస్తూనే ఉంది

తగిలిన గాయాలన్నీ మచ్చలుగా మిగిలాయి
ఒక మచ్చ మాత్రం నన్నింకా బాధిస్తూనే ఉంది

ఎవరికి తోచిన తాత్పర్యం వాళ్ళు చెప్తున్నారు
సూటిగా చెప్పకుండా శాస్త్రం ఏదో ఘోషిస్తూనే ఉంది

ఏదో చెప్పాలనుకుంది, చెప్పలేకపోతోంది
ఒక పసిపాప గుక్కపట్టి ఏడుస్తూనే ఉంది

గుండెల్లో మకరందం ఎంత నింపుకుందో
ఒక పువ్వు తుమ్మెద దాహం తీరుస్తూనే ఉంది

కళ్ళ నింగిలో జ్ఞాపకాల మేఘాలు కమ్ముకున్నాయి
ఈ జడివాన రాత్రంతా కురుస్తూనే ఉంది

భావావేశం రక్తంలో కలగ్గలిసిపోయాక
తనువంతా రసగంగ ప్రవహిస్తూనే ఉంది

నిజం గెలిచితీరేనని ఎవరో ప్రబోధించారు
అబద్ధం నిస్సహాయులని ఓడిస్తూనే ఉంది

అపుడెపుడో నాకోసం నువ్వు పాడిన పాట
గుండెల్లో అనునిత్యం ప్రతిధ్వనిస్తూనే ఉంది

'అంజలి ' ఊహకి రెక్కలు కట్టి ఎగరేశాను
సృజనావినీలాకాశంలో విహరిస్తూనే ఉంది.

***

# బిచ్చగాడు

రాధ అనుపూరు

ఓ దేవుడా!!!!
శిలవై, గుడిలో బందీవై....
నవరత్నావైడుర్యాలతో వెలుగుతూ..
సుగంధ పుష్ప పరిమళాలతో....

పెరుగుతున్న భక్తుల కోర్కెల లిస్టు
భరిస్తున్న, ఆస్వాదిస్తున్న నిన్ను చూసి....
దూరంగా, మౌనంగా నీ బాధ తిలకిస్తూ,,
"ఫూర్ గాడ్" అనుకొంటున్న...
కోవెల మెట్లపై నివాసినై.. హాయిగా "నా" లేని అనాధని,
సెల్ఫ్ ఏమ్ ప్లోయీని, ఫుల్ టైమ్ బెగ్గర్ని!!!
రేపనే చింతలేదు....రేషను కార్డు గొడవలేదు..
ఆదార్ కార్డు అంతకన్నా లేదు,,
మోర్టుగేజ్ ధ్యాసే లేదు....
గుడి గంటల ధ్వనులు, సుప్రభాతం పలకగా,,
ఆకలి మంటలు ఆర్చాలనే ఆరాటం మొదలై....
గుప్పెడు మెతుకుల కోసం ..దీక్షతో అలమటిస్తూ
మార్గంలేక..భిక్షమెత్తుతున్న, మాములు భిక్షగాడ్ని,
మానవత్వంతో, జాతి భేదం లేనివాడ్ని,
స్వార్ధం,తీర్ధం అంటూ ,బిచ్చగాడి స్థానం మార్చలేని కలియుగం,
కలికాలం పెట్టిన పేరు "హోమ్లెస్స్ వాడిని"
చీకు చింత లేక వెన్నెల పందిరిలో కునుకుపాట్ల పడుతుంటే..
గుడి తలుపులు మూయగానే....
అఖండ దీప వెలుగులో నిదుర పట్టక
పచార్లు చేస్తున్న దేవున్ని గాంచి..
ఏమిటి నీ గోలంటే ???
హుండిలో పెరుగుతన్న భక్తుల "బ్లాకు మనీ"
చెల్లని లెక్కలేని 2000 రూ,ని.... కుబేరుడు కూడ..
కూడదన్నాడని, బావురమంటూ..మార్గామేమంటూ??
తలపట్టుకున్న నిన్ను చూసాక..
తెలిసింది నీకూ ఈ బాదలు తప్పవని ..
దురాశ వలదని, "మోడిని" దర్శించమని.....మెల్లిగాజారుకుంటూ
దేవుడా !! బతికిపోయాను ఓ భిక్షగాడిగా జీవిస్తున్నందుకు,
మొదటిసారిగా దండాలు పెడతూ
వెలకట్టని ఆనందంతో కునకు తీసాను,
ప్రశాంతంగ,,, ఓ మిలియనేరుగా!!!!

****

# నీ దివ్యమంగళ ముఖంతోనే రా -డా.నారాయణ గరిమెళ్ల

ఏ ముఖం పెట్టుకు రావాలోనని ఎప్పుడూ సంశయించకు!
నీ దివ్య మంగళ ముఖంతోనే రా!

గురుత్వాకర్షణ తో సహా
ప్రేరేపణలు కూడా
అధఃపాతాళానికే అంటున్న వేళ
పడటం అంటే పరువు పోవడం కాదు!

పడినా కూడా
లేవడములోనే ప్రగతి ఉంది

దుమ్ము దులుపుకున్నా
ముఖం కడుక్కున్నా
ఆ దివ్య మంగళ ముఖాన్ని మాత్రం
నిత్యం నీతోనే తీసుకురా.

అహర్నిశలూ అంకితమై సాకిన పంటతల్లి
అండగా అందిరాలేనని
చేతులెత్తేస్తే మాత్రం
కుటుంబ వృక్షాన్ని సైతం పెకళించుకునేలా
ముఖమెందుకు మాలిపోవాలి?

రాత్రింబగళ్ళు చదివిన చదువు
అనుకున్న గట్టు ఎక్కించ లేకపోతే మాత్రం
అమ్మా నాన్నల ఆశలు ఆహుతి చేసేలా
ముఖమెందుకు మాలిపోవాలి?

కడవరకూ కలిసుంటానన్న భాగస్వామి
కనుమరుగైనా తెరమరుగైనా
నిన్ను నమ్మిన నీ నూరేళ్ళనూ కాదని
నీ ముఖమెందుకు మాలిపోవాలి?

కారణమేదైనా
వేరొక ముఖం గురించి మాత్రం
వెదుకులాట ఉండకూడదు

అప్పులు పాలిట యమకింకరులైనా
ఉద్యోగం ఊడి వ్యంగ్యంగా గాలి పటాలెగరేసినా
కర్తవ్యం దగా పడి ధక్కామొక్కీలు తిన్నా
మోస పోయి నిజం నిలువుటద్దమైనా
అలసి పోయి విగ్రహం ఆధీనం తప్పుతానన్నా
అరిగి పోయి చెప్పు చప్పుడు తో వెక్కిరించినా
ఆకలేసినా, ఆవేదన చెందినా, ఆగ్రహం రగిలినా
సమస్యల సుడిగుండమొకటి ముంచుతూ తేల్చుతూ పరిహాసాలాడుతున్నా
పొరపాట్లన్నీ మీదకి మూకుమ్మడి పోట్లాటకు పథక రచన చేసినా
ముఖాన్ని మాత్రం మారిపోనివ్వకూడదు
ముఖమూ నువ్వూ పరస్పరం అభినందించుకుంటూ గర్వపడాలి.

ప్రమిదలో నూనె వేసి దీపాన్ని నిలబెట్టాకే
వెలుతురులో వెదకాల్సినది దొరుకుతుంది

నీకు నీ ముఖమే బాగుంటుంది
ఆ ముఖం పెట్టుకునే
కార్యరంగంలోకి దూకు
కదం తొక్కుతూ ఎదుగు
****

# మనోడే — పారుపూడి భారతి

## మొట్టమొదటి కవితావిభాగం

ఎవరు పరిచయమైనా మర్నాడే పరిచయమైన వాడు 'మనోడేనా'
అని కనుక్కొంటే వాడు తెలుగోడే మనోడే ॥

గడ బిడగా అందరు వడి వడిగా తిరుగుతుంటే
ఎవడైనా విడిగా ఫోన్లో వార్తలు చదువుతుంటే, ఆ చదువరి మనోడే॥
డాలర్ తగ్గుంతుందంటే పది డాలర్లు ఖర్చు చేసి
మైళ్ళకి మైళ్ళు డ్రైవ్ చేస్తే , ఆ తొందరి మనోడే॥
కూపన్లతో కష్టపడి దాచిన డాలర్లలో ఎంతో కొంత
ఆపన్నులకు ఇచ్చి సంతోషపడే ఉదారి మనోడే॥
బ్లో తెలుగుని ఆంగ్లంలో వ్రాసే చమత్కారి మనోడే ,
వేడుకలో ఇంగ్లీషుని తెలుగులో మాట్లాడే నుడికారి మనోడే ॥
ఎంత దూరంలో ఉన్నా కన్న ఊరికి ఉపకారి మనోడే
ఊరి వాళ్ళు కలిపిస్తే ముచ్చట్లాడి మురిసే మమకారుడు మనోడే॥
గుళ్లో దేవుని ముందు పది నిముషాలు
కాంటీన్లో పది పదుల నిమిషాలు గడిపే మేతగాడు మనోడే ॥
జన గణ మణ పాడమంటే గుస గుస లాడి
తెలుగు సినిమా పాట గట్టిగా పాడువాడు మనోడే ॥
ఈ-మెయిల్లో ఎవరో పోయారని తెలిస్తే
ఎంతో కొంత సాయం చేసే మనసున్నోడు మనోడే ॥

మంచోడు మనోడే , మెతకోడు మనోడే , మొరటోడు మనోడే , మొండోడు మనోడే
మౌనుడు ,మాన్యుఁడు , దోహలుఁడు ,కోలాహలుఁడు , హల్లోహలుఁడు అన్నీ వీడే
విడిబడిన మనోడే , తడబడిన మనోడే , కలబడిన మనోడే
వీడు మనోడే , వాడు మనోడే , వీడు మనోడే , వాడు మనోడే
అమెరికాలోని ప్రతి తెలుగువాడు మనోడే

★★★★

COMMENTS